నార్కట్‌నల్లి తహశీల్దార్ వెంకటేశ్వర్ రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనను సన్మానించిన వీ3 న్యూస్, విశ్వంభర దినపత్రిక చైర్మన్ డా. కాచం సత్యనారాయణ.

ఓల్డ్ ఏజ్ హోమ్‌ను సందర్శించిన త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి

విశ్వంభర, వనస్థలిపురం : రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓల్డ్ ఏజ్ హోమ్‌ను ప్రముఖ ఆధ్యాత్మిక గురువు త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలో నివసిస్తున్న వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి ఆశీస్సులు అందజేయడంతో పాటు ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వహణకు ఆర్థిక సహాయాన్ని అందించారు. జీయర్ స్వామి రాక సందర్భంగా ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకులు పెద్ది శంకర్ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీయర్ స్వామివారి ఆశీర్వాదాలతో ఓల్డ్ ఏజ్ హోమ్‌కు సొంత స్థలం సమకూర్చుకోవాలన్న తమ చిరకాల కల త్వరలోనే నెరవేరుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. వృద్ధులకు సేవ చేయడం అత్యున్నత మానవ ధర్మమని పేర్కొన్న జీయర్ స్వామి, ఇలాంటి సేవా కార్యక్రమాలను సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్శనతో ఆశ్రమంలోని వృద్ధులు ఆనందం వ్యక్తం చేయగా, ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు మరింత ప్రోత్సాహం లభించిందని ప్రథ్యం శర్మ, అనిరుద్, శ్రీధర్ శర్మ, నాగ మోహన్ శర్మ, సుభాషిని, పాత్, నాగరాజు గౌడ్, విజయ గౌడ్, రేణుక ప్రకాష్‌నవీన్, బాలకృష్ణ, దుర్గాప్రసాద్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

పెన్షన్ లైవ్ ఆథెంటికేషన్ కు చివరి తేదీ - జూలై 2

విశ్వంభర, ఎల్బీనగర్ : ఎల్.బి.నగర్ సర్కిల్ పరిధిలోని లింగోజిగూడ - 37, చంపాపేట్ -38, కర్మన్ ఘాట్ -39, బైరామల్గూడ-40, హస్తినాపురం 41 వార్డు కార్యాలయాలలో పెన్షన్ లబ్ధిదారుల కోసం పెన్షన్ లైవ్ ఆథెంటికేషన్ కార్యక్రమం నిర్వహించబడుతోంది అని డిప్యూటీ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. 02 జూలై 2026 పెన్షన్ లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవడానికి చివరి తేదీ కావున, ఇప్పటివరకు లైవ్‌ఆథెంటికేషన్ పూర్తి చేయని అర్హులైన పెన్షన్ లబ్ధిదారులు తమకు సంబంధించిన వార్డు కార్యాలయాన్ని అవసరమైన పత్రాలతో గడువులోగా తప్పనిసరిగా సందర్శించి ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవాలి అని సూచించారు. లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేయని పక్షంలో పెన్షన్ పంపిణీలో అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నందున, చివరితేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే లైవ్ ఆథెంటికేషన్ పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు విజ్ఞప్తి చేశారు.

శ్రీనివాస్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

విశ్వంభర, చార్మినార్ : హైదరాబాద్ జిల్లా బహదూర్పుర మండలం ప్రభుత్వ బాలుర అందుల ఉన్నత పాఠశాల దారుల్ షిఫా ప్రధానోపాధ్యాయులు రాయల శ్రీనివాస్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. సహచర ఉపాధ్యాయులు , ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి కి ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ అందుల పాఠశాలలో పనిచేయడం గొప్ప అనుభూతి చెందిందని విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంలో ఎంతో కృషి చేశానని ,ముఖ్యంగా హాస్టల్ గురించి జరుగుతున్న ఇబ్బందులను పై అధికారులతో చర్చించి హాస్టల్ కు నిధులను సమకూర్చడంలో ఎంతో కృషి చేశానని అని అన్నారు .ఆ నిధులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థుల సర్వతో ముఖ అభివృద్ధికి పాటుపడాలని ఈ సందర్భంగా ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు అందరూ చక్కగా చదువుకోవాలని భవిష్యత్తులో మంచిగా స్థిరపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ఇన్చార్జి సద్గుణ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మందడి వెంకటరెడ్డి , ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై బూత్ లెవెల్ ఏజెంట్లకు అవగాహన సదస్సు

విశ్వంభర, సరూర్ నగర్ : తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఆధ్వర్యంలో చేపట్టనున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ సర్ కార్యక్రమం రామకృష్ణాపురం , ఎన్టీఆర్ నగర్ , జలపల్లి డివిజన్ ల బూత్ లెవెల్ ఏజెంట్ల విధివిధానాలు, ఓటర్ల జాబితా సవరణపై డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టిపిసిసి మెంబర్ దేప భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బూత్ లెవెల్ ఏజెంట్లు బాధ్యతగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తప్పుల సవరణ మరియు విధివిధానాలపై ఏజెంట్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతి బూత్ పరిధిలో కాంగ్రెస్ శ్రేణులు చురుగ్గా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి,ముప్పిడి లింగస్వామి గౌడ్, మహేందర్, జ్ఞానేశ్వర్ , శేఖర్ , దుబ్బాక శేఖర్, ఎస్ కే మహమ్మద్, రామకృష్ణ, సుదర్శన్,రమేష్, నబీ, సైదులు ,పటేల్, శ్రవణ్, శ్రీధర్,జహంగీర్, రఫీ, రేణుక, రమాదేవి, కవిత, మంజుల, రజిని, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్ క్వార్టర్‌గా హైదరాబాద్

- సీఎంతో భేటీలో సునీల్ మిట్టల్
- చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత తొందరగా ప్రారంభించాలి
- తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలి : సునీల్ మిట్టల్ కోరిన రేవంత్ రెడ్డి

విశ్వంభర, హైదరాబాద్ : హైదరాబాద్‌లో ఎయిర్‌టెల్ డిజిటల్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, ఎఐ కార్యకలాపాలపైన దృష్టి పెట్టాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ భారతి మిట్టల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్‌డీ బోధీ పెవిలియన్‌లో సునీల్ భారతి మిట్టల్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణలో చేపట్టిన అనేక కార్యక్రమాలు, సంస్కరణలను వివరిస్తూ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారిన అంశాలను ప్రస్తావించారు. ప్రత్యేకంగా విద్యా రంగంలో తీసుకొస్తున్న సంస్కరణలు, ప్రభుత్వ పాఠశాలలను ప్రక్షాళన చేస్తున్న తీరును వివరించారు. పారిశ్రామిక రంగ అవసరాలకు అనుగుణంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించడానికి ప్రత్యేకంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, ఐటీఐలను అధునాతన సాంకేతిక విధానాలతో ఏటీసీలుగా మార్చిన విషయాలను తెలిపారు. ఇదే కోవలో పాలిటెక్నిక్ కాలేజీల అధునికీకరణ గురించి చెప్పారు. వీలైనంత తొందరగా చందన్ వెల్లి డేటా సెంటర్ చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వీలైనంత తొందరగా ప్రారంభించాలని, తెలంగాణలో మరింత పెద్ద సమగ్ర డేటా సెంటర్, ఎఐ మౌలిక సదుపాయాల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని సీఎం కోరారు. రాష్ట్రంలో భవిష్యత్ పెట్టుబడి అవకాశాలు, సమస్యలను పరిష్కరించడం కోసం తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పనిచేసేలా ఒక సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ను నామినేట్ చేసి సమస్వయం చేసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.

విద్యార్థులకు స్కాలప్ షిప్‌లు:

భారతీ ఫౌండేషన్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఏటీసీల్లో చదువుకునే విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తామని ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ సీఎంకు తెలిపారు. అలాగే, ఎయిర్‌టెల్‌కు రెండో హెడ్ క్వార్టర్‌గా హైదరాబాద్‌ను పరిగణిస్తున్నామని చెప్పారు. డేటా సెంటర్ల కెపాసిటీని మరింత పెంచడానికి సిద్ధంగా ఉన్నామని, తెలంగాణలో ఫైబర్ కనెక్టివిటీ మరింత పెంచడంపైన ఈ సందర్భంగా సునీల్ మిట్టల్ ఆసక్తిని ప్రదర్శించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: నిర్మలా జగ్గారెడ్డి

విశ్వంభర, సంగారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' వానాకాలం-2026 వాయిదా తొలి విడత నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం హైదరాబాద్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డి పల్లి లోని రైతు వేదిక లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సంగారెడ్డి టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మరియు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ విడతలో భాగంగా సంగారెడ్డి జిల్లాలో 2 ఎకరాల వరకు వ్యవసాయ భూమి కలిగిన 2,42,753 మంది అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు రూ.125.83 కోట్ల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులు నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నాయి.ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ, వానాకాలం సాగు పనులు మొదలవుతున్న తరుణంలో రైతులకు పెట్టుబడి సాయం అందించడం హర్షణీయమన్నారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఈ నిధులు జిల్లాలోని రైతులకు ఎంతో ఆసరాగా నిలుస్తాయని ఆమె పేర్కొన్నారు.

పారదర్శకంగా నిధుల జమ: జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అర్హులైన 2.42 లక్షల మందికి పైగా రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ అవుతున్నాయని తెలిపారు. అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారని, రైతులు ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, జిల్లా స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి.. ప్రైవేట్ ప్లాట్లను కబ్జా చేయడం మానుకోవాలి : తెలంగాణ జనసమితి

విశ్వంభర, రంగారెడ్డి కలెక్టరేట్ : టీజీఐఐసీ అధికారులు హార్డ్‌వేర్ పార్కు పేరుతో ప్రైవేట్ ప్లాట్లను అక్రమంగా కబ్జా చేసే చర్యలను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దార సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల గ్రామ పరిధిలోని సర్వే నెం.67లో దాదాపు 300 ప్రైవేట్ ప్లాట్లకు తెలంగాణ హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రహరీ గోడ నిర్మించడం, ఇనుప గేట్లు ఏర్పాటు చేయడం తీవ్ర అభ్యంతరకరమని వారు పేర్కొన్నారు. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను గౌరవించకుండా అధికారులు వ్యవహరించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, న్యాయవ్యవస్థను అవమానించే చర్యగా భావిస్తున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తెలంగాణ జనసమితి నాయకులు బాధిత ప్లాట్ యజమానులతో కలిసి టీజీఐఐసీ జోనల్ మేనేజర్ జ్యోతి కి వినతిపత్రాన్ని అందజేశారు. హైకోర్టు ఆదేశాలను వెంటనే అమలు చేయాలని, సర్వే నెం.67లో జరుగుతున్న ప్రహరీ గోడ నిర్మాణం, గేట్ల ఏర్పాటు వంటి అన్ని పనులను తక్షణమే నిలిపివేయాలని, రెవెన్యూ రికార్డుల్లో అసలు ప్లాట్ యజమానుల హక్కులను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. లేనిపక్షంలో బాధిత ప్లాట్ యజమానులతో కలిసి తెలంగాణ జనసమితి అధ్యక్షులు ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నాయకత్వంలో చట్టబద్ధమైన ప్రజా ఉద్యమాన్ని చేపట్టి, న్యాయం కోసం అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్లాట్ల యజమానులు జి భాస్కర్, ఆర్కే నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఎ. పి. దహిమా

కార్యదర్శిగా పి.వి. నారాయణ రావు ఏకగ్రీవ ఎన్నిక

విశ్వంభర, హైదరాబాద్ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఐటీపీ ఎ. పి. దహిమా, ఉపాధ్యక్షులుగా సీఏ కె. ఆదినారాయణ కోట, కార్యదర్శిగా సీఏ పి. వి. నారాయణ రావు, సంయుక్త కార్యదర్శిగా సీఏ నాగ ప్రవల్లిక వేముల, కోశాధికారిగా సీఏ పంకజ్ సంచేటి లతోపాటు ఏడు మంది గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు అడ్వొకేట్ ఎన్. వి. చారి, అడ్వొకేట్ సోమేశ్వర్ నెమ్మాని, సీఏ ప్రకాష్ చోక్డా, సీఏ శైలేందర్ శర్మ, సీఏ పంకజ్ చందక్, సీఏ లీలా కృష్ణ మోహన్, సీఏ ఆశిష్ జోషి లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల పరిశీలకులు సీఏ రామ్‌దేవ్ భుటాడా, సీఏ అమృత్ కుమార్ కోట సమక్షంలో ఎన్నికల అధికారి సీఏ హితేష్ జైన్ ప్రకటించారు. తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ 55వ వార్షిక సర్వసభ్య సమావేశం మంగళవారం హైదరాబాద్, బషీర్ బాగ్ ఓ హోటల్ లో నిష్క్రమిస్తున్న అధ్యక్షులు సిఎ చంద్రశేఖర్ వేముల అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చంద్రశేఖర్ వేముల 2025-2026 సంవత్సర వార్షిక నివేదికను ప్రవేశపెట్టి అసోసియేషన్ నిర్వహించిన వివిధ కార్యక్రమాలు, సాధించిన విజయాలు, ప్రభుత్వ అధికారులతో చేసిన ప్రతినిధి బృంద సమావేశాలు, వృత్తిపరమైన సెమినార్లు, సదస్సులు, ప్రచురణలు, సభ్యుల సంక్షేమ కార్యక్రమాలు వివరించారు. నూతన అధ్యక్షులు ఎ. పి. దహిమా, కార్యదర్శి పి. వి. నారాయణ రావులు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు కృతజ్ఞతలు తెలిపి, ట్యాక్స్ బార్ అసోసియేషన్ గొప్ప సంప్రదాయాలను కొనసాగిస్తూ, వృత్తిపరమైన నైపుణ్యాన్ని మరింత పెంపొందించడం, పన్ను నిపుణుల హక్కులు మరియు ప్రయోజనాలను పరిరక్షించడం, ప్రభుత్వ శాఖలతో మరింత సమన్వయాన్ని బలోపేతం చేయడం, సభ్యుల సంక్షేమానికి మరిన్ని కార్యక్రమాలు చేపట్టడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులూ "ట్యాక్స్ బార్ అధికారిక లాపెల్ పిన్"ను ఆవిష్కరించారు.

గ్యాస్ లీకై పేలుడు

విశ్వంభర, సరూర్ నగర్ : వంటగదిలో లీకైన గ్యాస్ దీపం వల్ల ఒక్కసారిగా పేలడంతో భారీ ఆస్తినష్టం జరిగింది. సరూర్‌నగర్ పోలీసుస్టేషన్ పరిధిలోని బాపునగర్‌లో మంగళవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ పేలుడులో ఇంటి యజమాని సహా ఎవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగి దేవరశెట్టి దేవేందర్ తన కుటుంబంతో కలిసి బాపునగర్ చౌడిసమీపంలోని రోడ్డు నం.4లో నివసిస్తున్నారు. ఈయన 1993లో ఆ ఇంటిని కొనుగోలు చేసి 2007లో మొదటి అంతస్తు నిర్మించారు. ప్రస్తుతం దేవేందర్ తన కుటుంబంతో ఈ అంతస్తులోనే నివసిస్తున్నారు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. ఆ ధాటికి వంట గది గోడలు ధ్వంసం కావడంతో పాటు కిటికీ ఊడి రోడ్డుపై పడింది. వంట సామను సహా ఆహార పదార్థాలు చెల్లాచెదురై.. ఫ్రిడ్జ్ కూడా కింద పడింది. హాలులో ఉన్న షోకేసు అద్దాలు పగిలి ఇంటి నిండా పడ్డాయి. ఘటనా స్థలాన్ని సరూర్‌నగర్ ఏసీపీ కృష్ణయ్య సందర్శించాడు. ఈ పేలుడికి గ్యాస్ లీకేజీ కారణమని ఫోరెన్సిక్ నిపుణులు ధృవీకరించారు. రెగ్యులేటర్‌కు, స్టౌకు మధ్య ఉండే పైపు నుంచి గ్యాస్ లీకైందని, వంట గదిలో మూలన ఉన్న పూజా మందిరంలో వెలిగించిన దీపం కారణంగా పేలుడు జరిగిందని అంచనా వేశారు. కేసు నమోదు చేసుకున్న సరూర్‌నగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసును అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్‌ల ద్వారా పరిశీలించారు. పేలుడు జరిగిన సమయంలో కుటుంబ సభ్యులంతా ఇంట్లోనే ఉన్నా... ప్రభావం హాలు దాటి పోకపోవడంతో వారికి ఎలాంటి హాని జరగలేదు. ఈ పేలుడు జరిగినప్పుడు వంటగదిలోనే మరో మూడు గ్యాస్ సిలిండర్లు ఉన్నాయి. అవి పేలి ఉంటే తీవ్రత, నష్టం చాలా ఎక్కువగా ఉండేదని అధికారులు చెప్తున్నారు.



నితిన్ నబిన్‌కు 'పన్నెండేళ్ల మోడీ పాలన – సామాజిక న్యాయం'

తొలి ప్రతిని అందజేసిన డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు

విశ్వంభర, హైదరాబాద్: అపుషాపూర్‌లోని రాక్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశ ప్రాంగణంలో, కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి శ్రీ జి. కిషన్ రెడ్డి సమక్షంలో డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు రచించిన త్రిభాషా గ్రంథం 'పన్నెండేళ్ల మోడీ పాలన - సామాజిక న్యాయం' తొలి ప్రతిని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్‌కు అందజేశారు.ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని గత పన్నెండేళ్ల పాలనలో సామాజిక న్యాయం, సమ్మిళిత అభివృద్ధి, వెనుకబడిన వర్గాల సాధికారత, సంక్షేమ కార్యక్రమాలు, పాలనా సంస్కరణలు, దేశ అభివృద్ధి దిశగా చేపట్టిన ప్రధాన విధాన నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ త్రిభాషా గ్రంథాన్ని రచించినట్లు డా. వకుళాభరణం కృష్ణమోహన్ రావు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీ ఈ. పెద్దిరెడ్డి, పార్టీ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఎంసీఈఎంఈ కమాండెంట్ నీరజ్‌కు 'అతి విశిష్ట సేవా పతకం'

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పురస్కార ప్రదానం

విశ్వంభర, న్యూఢిల్లీ : మిలిటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ కమాండెంట్, కార్ప్స్ ఆఫ్ ఈఎంఈ కల్నల్ కమాండెంట్ అయిన లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ వార్ష్నేయ్ (విశిష్ట సేవా మెడల్ (గ్రహీత) కు అరుదైన గౌరవం దక్కింది. భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఆయనకు ప్రతిష్టాత్మక 'అతి విశిష్ట సేవా పతకం' ప్రదానం చేశారు.జూన్ 29న న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన రక్షణ పురస్కారాల ప్రదానోత్సవం (డిఫెన్స్ ఇన్వెస్టిచర్ సెరిమనీ ఫేజ్ 2)లో రాష్ట్రపతి చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని సగర్వంగా అందుకున్నారు.లెఫ్టినెంట్ జనరల్ నీరజ్ కనబరిచిన అసాధారణ నాయకత్వ లక్షణాలు, ఆయన అందించిన విశిష్ట సేవలు, దేశం పట్ల ఆయనకున్న అచంచలమైన నిబద్ధతకు ఈ అవార్డు ఒక నిదర్శనం. ఆయనకు ఈ అత్యున్నత పురస్కారం దక్కడం ఎంసీఈఎంఈ తో పాటు కార్ప్స్ ఆఫ్ ఈఎంఈ విభాగానికి ఎంతో గర్వకారణమని సంబంధిత వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి.

రైతుల 'సీఎం రాయబారం'లో ఉద్రిక్తత

విశ్వంభర, విజయవాడ : రైతుల సమస్యల పరిష్కారాన్ని కోరుతూ చేపట్టిన 'సీఎం రాయబారం' కార్యక్రమంలో విజయవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడ ధర్నాచౌక్‌లో నిర్వహించిన ఆందోళన అనంతరం రైతులు 25 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేసేందుకు క్యాంపు కార్యాలయం వైపు ర్యాలీగా బయలుదేరారు. అలంకార్ సెంటర్ వద్ద పోలీసులు బారికేడ్లతో అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా బారికేడ్లు తొలగించే ప్రయత్నంలో తోపులాట జరిగింది. రైతులపై పోలీసులు లాఠీఛార్జ్ చేసి బూటుకాళ్లతో దాడి చేశారని రైతు సంఘాల నాయకులు ఆరోపించారు. అనంతరం రైతులు ప్రదర్శన కొనసాగిస్తూ రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, రుణ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ధర్నాచౌక్‌లో జరిగిన సభలో సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ, ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ రైతుల డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.